# సాక్షి మంచిర్యాల

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023




## మామిడి మార్కెట్ లేనట్లేనా..?

జిల్లాలోని మామిడికి వివిధ రాష్ట్రాలతోపాటు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. కానీ జిల్లాలో మార్కెట్ సౌకర్యం లేక ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించాల్సి వస్తోంది. 10లో▸


## నిషేధాజ్ఞలు కొనసాగింపు

మంచిర్యాలక్రైం: జిల్లాలో నిషేధాజ్ఞలను మే ఒకటి వరకు కొనసాగిస్తున్నట్లు సీపీ రెమా రాజేశ్వరి తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, రోడ్లపై అసభ్యకర పదజాలాన్ని వినియోగించడం నేరమని తెలిపారు. డ్రోన్ కెమెరాలు, డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధం విధించామని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
36.0 /23.0

## వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఈశాన్యం దిశగా వేడిగాలులు వీస్తాయి.




## న్యూస్‌రీల్

### 'టోల్'పై న్యాయ విచారణ వాయిదా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మందమర్రి శివారు టోల్‌ప్లాజా వద్ద వాహనదారుల నుంచి టోల్ వసూళ్లపై విచారణ మరోసారి వాయిదా పడింది. పనులు పూర్తి కాకుండానే టోల్ వసూలు చేస్తున్నారని, అత్యవసర వాహనాలు, స్థానికులకు మినహాయింపులు ఇవ్వడం లేదని బెల్లంపల్లికి చెందిన న్యాయవాది రవికుమార్ జిల్లా న్యాయసేవాధికార సంస్థలో ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీనిపై శనివారం మరోసారి విచారణ జరిగింది. నేషనల్ హైవే అథారిటీ అధికారులు, టోల్‌ప్లాజా మేనేజర్, ప్రభుత్వ ప్లీడర్ హాజరయ్యారు. టోల్‌ప్లాజా, ప్రభుత్వ అధికారులు కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు. న్యాయవాది రవికుమార్ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ముందు వాదనలు వినిపిస్తూ స్థానిక వాహనాలు, అంబులెన్స్‌లకు మినహాయింపులు ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న జడ్జి తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేశారు.

### సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కార్యకర్తలకు సూచించారు. శనివారం పట్టణంలోని అగర్వాల్ భవన్‌లో పలు వార్డుల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే చిన్నయ్య, బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నిరంజన్, మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కన్నెపల్లి జెడ్పీటీసీ సత్యనారాయణ, బెల్లంపల్లి బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బి.నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు పాల్గొన్నారు.

### చిరుధాన్యాలతోనే ఆరోగ్యం



వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివాకర్

మంచిర్యాలటౌన్: పోషక విలువలు కూడిన చిరుధాన్యాలతో తీసుకునే ఆహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పోషణ పక్వాడను శనివారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో చిన్నారుల తల్లిదండ్రులతో పోషక ఆహారం వండే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య మాట్లాడుతూ ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, తల్లిదండ్రులను భాగస్వామ్యులను చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి హేమసత్య, సీడీపీవోలు ఉమ, స్వరూప, రేష్మ, మనోరమ, సీడీపీవో ఆనంద్ పాల్గొన్నారు.

### పకడ్బందీగా 'పది' పరీక్షలు



మాట్లాడుతున్న ఉషారాణి

మంచిర్యాల అర్బన్: పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు పదో తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి అన్నారు. శనివారం ఆమె జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో వసతులు, సీసీ కెమెరాల ఏర్పాటు, పనితీరును పరిశీలించి సూచనలు చేశారు. డీఈవో కార్యాలయంలో డీఈవో వెంకటేశ్వర్లుతో కలిసి మాట్లాడుతూ ఏప్రిల్ 3నుంచి ప్రారంభమయ్యే పరీక్షల కోసం 55కేంద్రాలు ఏర్పాటు చేశామని, 10,125 మంది విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ దామోదర్ రావు, సెక్టోరల్ అధికారి పద్మజ పాల్గొన్నారు.

# బడి పిల్లల కథలు

- రచనలో రాణిస్తున్న వెల్గనూర్ విద్యార్థులు
- 31 కథలతో పుస్తకం ముద్రణ
- ప్రోత్సహిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు(ఫైల్)




కథల పుస్తకం కవర్‌పేజీ

సండే స్పెషల్

దండేపల్లి: ఎవరైనా కథలు చెబితే ఊ కొట్టే విద్యార్థులు వారు. కానీ వారే కథ రాసి భేష్ అనిపించుకున్నారు. ఒకరు కాదు ఇద్దరు ఏకంగా 45మంది విద్యార్థులు కథలు రాసి ఔరా అనిపించారు. అందులో 31 కథలతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, రచయిత్రి ల్యాదాల గాయత్రి పుస్తకాన్ని ముద్రింపజేశారు. తరగతి గదుల్లోని పిల్లలకు కథారచన పోటీలు నిర్వహించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ బృహత్తర ఆలోచన చేసింది. విద్యాశాఖ ఆదేశాల మేరకు గత ఏడాది మార్చి 4న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కథల పోటీల్లో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కలం పట్టి మెదడుకు పదును పెట్టారు. పరిసరాల పచ్చదనంపై కథా రచనకు ఉపక్రమించారు. 'మన ఊరు మన చెట్లు' అనే అంశంపై ఒక్కో విద్యార్థి ఒక్కో అంశాన్ని ఎంచుకుని ప్రకృతి, పరిసరాలతో తమకున్న అనుబంధాన్ని కథ రూపంలో రాశారు. 45 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కథా రచన, శిల్పం, శైలి అనే పదాలకు పూర్తిగా అర్థం తెలియకుండానే పాఠశాలలో, తమ గ్రామంలో పచ్చని హరితవనాలు ఎలా వెలిశాయో గమనించి తమ అనుభవాలనే కథలుగా మలిచి మెప్పించారు. 31ఉత్తమ కథలను ఎంచుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, రచయిత్రి ల్యాదాల గాయత్రి తన సొంత డబ్బులతో 'మన ఊరు మన చెట్లు' వెల్గనూర్ బడిపిల్లల కథలు పుస్తకాన్ని ముద్రింపజేశారు. మార్చి 24న పాఠశాలల ఆవిష్కరించారు.

### రాష్ట్ర స్థాయికి 'చెట్టు కోరిక'..

తెలంగాణ సాహిత్య అకాడమీ ఆలోచనతో విద్యాశాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో ఐదు వేలకు పైగా కథలు వచ్చాయి. ఇందులో వెయ్యి ఉత్తమ కథలను ఎంపిక చేసి పుస్తకాన్ని ముద్రించింది. అందులో వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బైరి రంజిత్ రాసిన 'చెట్టుకోరిక' కథకు చోటు లభించింది. గతంలో పది జిల్లాల బడి పిల్లల కథలు సంకలనంలో మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడిన 'ఆదిలాబాద్ బడిపిల్లల కథలు'లో వెల్గనూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాసిన మూడు కథలు ప్రచురితం అయ్యాయి. ఇవి పుసక్తంలో ప్రచురించడంతోపాటు ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రంలో కథ విందాం.. శీర్షికలో ప్రసారం అయ్యాయి. కథ రచనల్లో రాణిస్తున్న విద్యార్థులు బాల సాహితీ వేత్తలుగా ఎదగాలని ఆశిద్దాం.

### చెట్లు లేకుంటే మనం జీవించలేం..



చెట్లు లేకుంటే మనం నివసించలేము. చెట్లు మన కు చల్లని గాలి, నీడ, పండ్లు అందిస్తాయి. అ విలేకుంటే మనం జీవించలేము. దీనిని నేను ఎదుటి వారికి తెలియజేయాలనే కోరిక ఉండేది. కథల పోటీల్లో నా ఆలోచనకు కార్యరూపం దాల్చి కథగా రాశాను. కథ ఉత్తమ కథగా ఎంపికయ్యింది.

– అభిసారిక, 7వ తరగతి

### విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయొచ్చు..



కథ రచన పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగిన ఉన్న ప్రతిభను వెలికి తీయొచ్చు. విద్యార్థుల్లోని ఆలోచన శక్తి, కథ రూపంలో రాయాలన్న జిజ్ఞాస పెరుగుతుంది. కథల పోటీలతో విద్యార్థుల ప్రతిభ బయటపడింది. వారిలో మరింత ఉత్సాహం పెరిగింది. మా పాఠశాల హెచ్ఎం విద్యార్థులకు వెనుదన్నుగా ఉండి ప్రోత్సహించారు.

– బొడ్డుల స్వామి, తెలుగు ఉపాధ్యాయుడు

### విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుంది..



విద్యార్థులు చదువుతోపాటు సాహిత్యంపై శ్రద్ధ కలిగిన వారిలో పఠనాసక్తి పెరుగుతుంది. పైగా వారిలో దాగి ఉన్న సృజనాత్మకత మెరుగుపడుతుంది. నైతిక విలువలు పెంపొందుతాయి. చెడుకు దూరంగా ఉంటారు. కథల పోటీల్లో 45 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో, ఒక కథ రాష్ట్రస్థాయికి ఎంపికవడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. విద్యార్థులకు సాహిత్యంలో మరింత శ్రద్ధ, ఉత్సాహం కలిగేలా వారు రాసిన కథలు పుస్తక రూపంలో ముద్రించి, వాటిని ఇతర పాఠశాలకు పంపించేందుకు నా వంతు కృషి చేశాను.

– ల్యాదాల గాయత్రి, పాఠశాల హెచ్ఎం, వెల్గనూర్

### చెట్లంటే నాకిష్టం..



చెట్లంటే నాకు ఎంతో ఇష్టం. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో విద్యాశాఖ నిర్వహించిన కథల పోటీల్లో పాల్గొన్నాను. 'పువ్వుల సాయం' అనే కథ రాశాను. నేను రాసిన కథ ఉత్తమ కథగా ఎంపిక కావడం తోపాటు పుస్తకంలో ముద్రించబడినందుకు సంతోషంగా ఉంది.

– అక్షయ, 8వ తరగతి

### చెట్లను నిందించవద్దు..



చెట్లను నరికేటప్పుడు, చెట్టు కొమ్మ విరిగి ఓ వ్యక్తి చనిపోయాడు. దానిని గమనించిన నాకు ఓ ఆలోచన వచ్చింది. నా ఆలోచనను కథరూపంలో రాసే అవకాశాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ వారు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కథ ల పోటీలో లభించింది. చెట్లు మనలాంటి జీవులే అందుకని వాటిని నిందించవద్దు.

– సాత్విక్, 7వ తరగతి

### రైతులకు చెట్లతో సంబంధం ఉంది..



రైతులకు చెట్లకు ఎంతో సంబంధం ఉంది. రైతులు పడే కష్టాలకు చెట్లు చేసే సాయం పై నేను ఒక కథ రాశాను. నేను రాసిన కథ ఉత్తమ కథగా ఎంపిక కావడం, పైగా పుస్తకంలో ముద్రించడం చాలా సంతోషంగా ఉంది. ఇక ముందు కూడా మంచి, మంచి కథలు రాస్తాను.

– అమూల్య, 7వ తరగతి

# ప్రయాణికులపై 'టోల్' బాదుడు..!



హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు

- హైదరాబాద్ వెళ్లేవారిపై రూ.10 అదనపు భారం
- ఆర్టీసీ బస్సుల్లో శనివారం నుంచి అమల్లోకి..

మంచిర్యాలఅర్బన్: ప్రయాణికులపై ఆర్టీసీ టోల్ చార్జీల భారం మోపింది. జాతీయ రహదారులపై టోల్ చార్జీలను ఐదు శాతం పెంచడంతో ఆ భారాన్ని ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికులపై వేస్తోంది. శనివారం నుంచి పెరిగిన టోల్‌చార్జీలు అమల్లోకి తెచ్చింది. మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వారిపై అదనపు భారం పడుతోంది. మంచిర్యాల నుంచి రాజీవ్ రహదారిపై మూడు టోల్‌గేట్లు ఉన్నాయి. కిలోమీటరు లెక్కన బసంత్‌నగర్‌ను మినహాయిస్తే కరీంనగర్ దాటి వెళ్లిన బస్సులకు రెండు టోల్‌చార్జీల భారం పడనుంది. 38 బస్సుల్లో పెంచిన టోల్‌చార్జీలతో ప్రయాణికుల నుంచి రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు.

**ప్రయాణికులపై భారం**

టికెట్ ధరలు పెంచాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా సానుకూల స్పందన లేకపోగా వివిధ రకాల పన్నుల రూపంలో ప్రయాణికులపై భారం వేస్తోంది. గతంలో టికెట్ చార్జీలు పైసల్లో పెంచాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించే ప్రభుత్వం వివిధ పన్నుల రూపేణ పెంచిన ప్రతీసారి రూ.5నుంచి రూ.15వరకు భారం వేసింది. గత ఏడాది మార్చి నుంచి ఏప్రిల్‌లో ప్రయాణికుల నుంచి డీజిల్ సెస్, సేఫ్టీ సెస్ పేరుతో టికెట్‌పై ధరలు పెంచిన యాజమాన్యం చిల్లర సమస్యను అధిగమించేందుకు టికెట్ ధరలను రౌండప్ చేసింది. డీజిల్ సెస్ రూ.2, ఎక్స్‌ప్రెస్ మిగిలిన బస్సుల్లో రూ.5 కాగా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా రూ.2కు బదులు రౌండప్(చిల్లర సమస్య మాటున) రూ.5కు పెంచారు. ఎక్స్‌ప్రెస్, డీలక్స్ ఇతరత్రా బస్సుల్లో రూ.5కు బదులుగా రూ.10 తెలియకుండానే పెంచేశారు. సంవత్సరం గడిచిందో లేదో మరోసారి టోల్ చార్జీల పేరిట అదనపు భారం వేయడంపై ప్రయాణికుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రతీసారి చార్జీల వసూలు చేసే కంటే సంస్థ నుంచి ప్రభుత్వాలు వసూలు చేసే టాక్స్ రూపేణ కట్టే పన్నులు నిలిపి వేయాలనే డిమాండ్ లేకపోలేదు.

### జిల్లాలో ఈసారి లేనట్లే..

మందమర్రి సమీపంలో టోల్‌పాజా ఏర్పాటు చేసినప్పటికీ శనివారం అమల్లోకి వచ్చిన టోల్ చార్జీలు లేనట్లు తెలుస్తోంది. ఇటీవల మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌కు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిపై రూ.10 వసూలు చేస్తున్నారు. కొత్తగా టోల్‌చార్జీలు ఎక్స్‌ప్రెస్ బస్సులో మాత్రమే వసూలు చేయనున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రూట్లలో పల్లెవెలుగు బస్సులు మాత్రమే రాకపోకలు సాగించనుండడంతో ఈ దఫా టోల్‌చార్జీలు నుంచి మినహాయింపు లభించింది.

### మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు పెరిగిన చార్జీలు ఇలా

| బస్సులు | పాతధరలు(రూ.లలో) | కొత్త ధరలు(రూ.లలో) |
|---|---|---|
| జేబీఎస్(ఏసీ బస్సులు) | 620 | 630 |
| ఎంజీబీఎస్(ఏసీ) | 650 | 660 |
| మియాపూర్ | 660 | 670 |
| జేబీఎస్–(సూపర్‌లగ్జరీ) | 490 | 500 |
| ఎంజీబీఎస్(ఎస్ఎల్) | 510 | 520 |
| మియాపూర్–(ఎస్ఎల్) | 520 | 530 |



# ఎస్సైల బదిలీ

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో పని చేస్తున్న 20మంది ఎస్సైలు బదిలీ అయ్యారు. ఈ మేరకు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో మంచిర్యాల జిల్లాకు చెందిన పలువురు ఎస్సైలు ఉన్నారు.

| ఎస్సై పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| కే.నరేష్ | సీఎస్‌బీ రామగుండం | కన్నెపల్లి |
| కే.ప్రసాద్ | లక్సెట్టిపేట | దండేపల్లి |
| జీ.నరేష్ | నీల్వాయి | తాళ్లగురిజాల |
| ఎస్.రాజశేఖర్ | నెన్నెల | తాండూర్ |
| పీ.సుబ్బారావు | గోదావరిఖని వన్‌టౌన్ | నీల్వాయి |
| కే.మహేందర్ | మందమర్రి | భీమిని |
| జీ.ఉదయ్‌కిరణ్ | హాజీపూర్ | వీఆర్, ఆసిఫాబాద్ |
| ఎస్.వెంకటేష్ | భీమిని | గోదావరిఖని వన్‌టౌన్ |
| జీ.సురేష్‌వర్మ | కన్నెపల్లి | మంచిర్యాల |
| ఏ.మధుసూదన్‌రావు | టాస్క్‌ఫోర్స్ మంచిర్యాల | బసంత్‌నగర్ |
| ఎం.సంతోష్ | బెల్లంపల్లి వన్‌టౌన్ | సీసీసీ నస్పూర్ |
| ఎం.సాంబమూర్తి | దండేపల్లి | సీఎస్‌బీ మంచిర్యాల |
| డీ.కిరణ్‌కుమార్ | మంచిర్యాల | సీఎస్‌బీ రామగుండం |
| జీ.హరిశేఖర్ | మంచిర్యాల | సీఎస్‌బీ రామగుండం |
| జే.నరేష్‌కుమార్ | గోదావరిఖనివన్ టౌన్ | హాజీపూర్ |
| జీ.రాజశేఖర్ | తాళ్లగురిజాల | సీసీఎస్ మంచిర్యాల |
| బీ.సమ్మయ్య | తాండూర్ | సీసీఎస్ రామగుండం |

# అర్హులకు ప్రభుత్వ పథకాలు

- రెండవ విడత గొర్రెల పంపిణీ
- రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



పాల్గొన్న కలెక్టర్ బాదావత్ సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలను అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండో విడత గొర్రెల పంపిణీ, కంటివెలుగు, ఆరోగ్య మహిళ, జీవో నం 58, 59, 76, 118, పోడుభూములు, పట్టణ ప్రాంతాల్లో డబుల్‌బెడ్రూం ఇళ్ల పథకంపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ గొల్లకుర్మలకు 75 శాతం రాయితీతో రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీ త్వరలోనే జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో రెండు పడకగదుల ఇళ్ల లబ్ధిదారుల కేటాయింపులో పురోగతి ఉందని, ఈ నెల 15 నాటికి లబ్ధిదారుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి పాల్గొన్నారు.

# పోడు భూములకు పట్టాలు ఇస్తాం



పాదయాత్ర చేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, నాయకుడు రాజ్‌ఠాకూర్

- కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలి
- సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క

నెన్నెల: నిత్యావసరాల ధరలు తగ్గాలన్నా, పోడు భూములకు పట్టాలు రావాలన్నా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రజలకు పిలుపునిచ్చారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర శనివారం మండలంలోని మెట్‌పల్లిలో ప్రారంభమై.. చిత్తాపూర్, ఆవుడం మీదుగా గంగారం వరకు సాగింది. సుమారు ఎనిమిది కిలోమీటర్లు సాగిన పాదయాత్రలో జనం భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తాగడానికి నీళ్లు, ఉండడానికి ఇళ్లు లేవని, పెరిగిన నిత్యావసర ధరలతో బతుకు భారమవుతోందని చిత్తాపూర్‌లోని ఎస్టీ కాలనీ మహిళలు విక్రమార్కకు గోడు వెళ్లబోసుకున్నారు. తాతల కాలం నుంచి పోడు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ భూములను అటవీ అధికారులు లాక్కొని చెట్లు నాటారని, ఇప్పుడు బతికేది ఎలా అంటూ ఆ భూములకు పట్టాలు ఇప్పించాలని పొట్యాల కోయవాడకు చెందిన పలువురు మహిళలు వేడుకున్నారు. ఇటీవలే అకాల వర్షానికి మామిడి కాయలు నేలరాలి తీవ్రంగా నష్టం వాటిల్లిందని మామిడి రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మామిడికి ఎకరాకు రూ.20 వేల పంట నష్టం ఇప్పించాలని కోరారు. మామిడి, జీడి మామిడి తోటలను పరిశీలిస్తూ పాదయాత్ర కొనసాగించారు. మామిడి పండ్ల రుచిని చూడమని సీఎల్పీ నేతకు జీడీ మామిడి పండ్లు అందజేశారు. ఆయన రూ.500 ఇచ్చి పంట నష్టం పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం తన కుటుంబానికి మాత్రమే నీళ్లు, నిధులు, నియామకాలు ఇచ్చుకున్నారని ఆరోపించారు. మిషన్ భగీరథ అని చెప్పి కోట్ల రూపాయలు ఖర్చు చేసిన పల్లెల్లో తాగు నీటికి ఇక్కట్లు తప్పడం లేదన్నారు. ఇంటింటికీ తాగునీరు ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో అసలు ఓటే అడగబోమని వాగ్దానం చేసి తిరిగి ఓట్లు అడిగిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని అన్నారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, రామగుండం కాంగ్రెస్ నాయకుడు రాజ్‌ఠాకూర్, నాయకులు నేతరి స్వామి, చిలుముల శంకర్, రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

### నేడు భీమారం మండలంలో..

భీమారం: విక్రమార్క పాదయాత్ర నెన్నెల మండలం గంగారాంలో ముగిసింది. రాత్రి భీమారం మండలం కాజిపల్లిలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. నాలుగు కిలోమీటర్ల దూరంలోని దాంపూర్ వరకు పాదయాత్ర సాగింది. అక్కడే బస చేశారు. ఆదివారం ఉదయం బూరుగుపల్లి మీదుగా భీమారం వరకు పాదయాత్ర కొనసాగుతుంది. పోలంపల్లిలో రాత్రి బస చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

# ప్రోటోకాల్ పాటించరు.. అధికారులు రారు

- జెడ్పీ స్థాయీ కమిటీ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

మంచిర్యాలటౌన్: జెడ్పీ నిధులతో మండలాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ సభ్యులను ఆహ్వానించడం లేదని, ఏ కార్యక్రమంలోనూ తమకు స్థానం కల్పించకుండా ప్రోటోకాల్‌ను విస్మరిస్తున్నారని, జెడ్పీ సమావేశాలకూ జిల్లా స్థాయి అధికారులు డుమ్మా కొడుతున్నారని జెడ్పీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థాయీ కమిటీ సమావేశాలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ అటవీశాఖ జిల్లా అధికారి ఏ సమావేశానికి హాజరు కాకపోయినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కింది స్థాయి అధికారులు సమస్యలపై సమాధానం చెప్పడం లేదన్నారు. వేమనపల్లి జెడ్పీటీసీ రుద్రబట్ల స్వర్ణలత మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సు, సిబ్బంది లేక ప్రసవాలకు ఇబ్బందిగా మారుతోందని, ఉన్న అంబులెన్స్ పాతదిగా మారిందని, కొత్త అంబులెన్స్ ఇప్పించాలని కోరారు. లక్సెట్టిపేట జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖలో అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టాలని, ప్రతీ కార్యక్రమానికి జెడ్పీటీసీలను ఆహ్వానించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.నరేందర్, జెడ్పీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### శ్రీరాంపూర్‌లో 102 శాతం బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్ గనుల్లో 2022–23 ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 102 శాతం సాధించినట్లు ఏరియా ఎస్‌ఓటు జీఎం త్యాగరాజు తెలిపారు. శనివారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉత్పత్తి లక్ష్యం 66.4 లక్షల టన్నులకు గాను 67.9 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. ఆర్కే 8 గని, ఎస్సార్పీ 3 గనులకు సంబంధించిన పర్యావరణ ఉల్లంఘన కింద ఈ నెల 11న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. శ్రీరాంపూర్‌లో ఇప్పటి వరకు 3187 మందికి కారుణ్య ఉద్యోగాలు కల్పించామని, 3680 మంది మెడికల్ ఇన్వాలిడేషన్ అయ్యారని తెలిపారు. మార్చి 29న శ్రీరాంపూర్ నుంచి 33225 టన్నుల బొగ్గు రవాణా చేసిన రికార్డు నెలకొల్పామన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవి, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

లక్సెట్టిపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన రాజేందర్ (26) మృతిచెందాడు. శుక్రవారం రాత్రి దండేపల్లి మండలం చింతపల్లికి వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

### తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



చిందరవందరంగా బీరువాలోని దుస్తులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి స్టేషన్‌రోడ్ కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వన్‌టౌన్ ఎస్సై సంతోష్ కథనం ప్రకారం.. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికురాలు జాగిర్తి మమత గతనెల 30న ఇంటికి తాళం వేసి అవసరం రీత్యా కొత్తగూడెం వెళ్లింది. తిరిగి శనివారం ఉదయం ఇంటికి చేరుకోగా తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించింది. తలుపును తీయడానికి యత్నించగా లోపలి నుంచి గొళ్లెం వేసి ఉన్నట్లు గ్రహించింది. ఇంటి వెనుక వైపు నుంచి తలుపు తాళం తీసి లోనికి వెళ్లింది. బీరువాలో ఉన్న గ్రాము బంగారం, రూ.25 వేల నగదు, భూమి దస్త్రాలను ఎత్తుకెళ్లారు. ఘటనాస్థలిని ఎస్సై సంతోష్ పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





# పంచతత్వానికి ప్రజాదరణ

పార్కులో వాకింగ్ చేస్తున్న వాకర్స్

- ఆదిలాబాద్‌లో ఆక్యూప్రెషర్ పార్కు
- నడకకు పలువురి ఆసక్తి

**ఆదిలాబాద్: పట్టణ ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యం కోసమే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీపార్కులో పంచతత్వ ఆక్యూప్రెషర్ పార్కు ఏర్పాటు చేశారు. రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన పార్కులో 12 ఎంఎం, 4 ఎంఎం కంకర నల్ల రేగడి మట్టి, ఇసుక రేణువులు, గులకరాళ్లు నీటితో కూడిన వాకింగ్ ట్రాక్ సిద్ధం చేశారు. ట్రాక్‌పై చెప్పులు లేకుండా నడవడం ద్వారా అన్ని అవయవాలకు రక్తప్రసరణ జరిగి శరీరంలోని నాడులన్నీ ఉత్తేజితమవుతాయని వైద్యులు చెబుతున్నారు. ఇది ఉమ్మడి జిల్లాలోనే తొలి పార్క్ కావడం విశేషం. ఈ పార్క్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రజల తాకిడి ఎక్కువవుతోంది. పార్కు వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయని వాకర్లు చెబుతున్నారు. వారి మాటల్లోనే తెలుసుకుందాం.**

### యోగా సాధనకు ఏర్పాట్లు చేయాలి



పంచతత్వ పార్కును పచ్చని చెట్ల మధ్య ఏర్పాటు చేయడం వల్ల ఎంతో ప్రశాంతతను చేకూరుస్తుంది. పార్కులో నడవడంతో శరీరానికి సరైన రక్తప్రసరణ జరిగి రిలాక్స్‌గా అనిపిస్తుంది. ఇందులో నడిచిన అనంతరం యోగా చేస్తున్నాం. పార్కు పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలంలో గద్దిని ఏర్పాటు చేస్తే యోగా చేసుకోవడానికి వీలవుతుంది.

– అనిత, శాంతినగర్, ఆదిలాబాద్

### కొత్త అనుభూతి



ప్రతిరోజు నడిచే నడక కంటే ఇందులో నడవడం వల్ల కొత్త అనుభూతి కలుగుతుంది. బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులు అదుపులో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. పంచతత్వ పార్కులను పట్టణంలో మరికొన్ని చోట్ల ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– శివాజీ, ఆదిలాబాద్

### నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి



పార్కు నిర్వహణను మరింత పకడ్బందీగా చేపడితే వాకర్లు ఎక్కువ సంఖ్యలో రావడానికి అవకాశం ఉంటుంది. వాకింగ్ ట్రాక్‌లో నీటిని రోజు శుభ్రపరచి కొత్త నీటిని నింపితే బాగుంటుంది. రోజులుగా నీరు అలాగే నిల్వ ఉండడంతో అడుగు భాగంలో పాకురు ఏర్పడి జారిపడిపోయే అవకాశాలున్నాయి. అధికారులు దృష్టి సారించాలి.

– మహేశ్, బ్రహ్మణ్‌వాడ, ఆదిలాబాద్

### అవగాహన కల్పించాలి



నా కుమారుడితో కలిసి ఈ పార్కులో నడుస్తున్నా. థీమ్ పార్కు ఏర్పాటుతో ఆరోగ్యంపైన ప్రతి ఒక్కరికి శ్రద్ధ పెరుగుతుంది. నా కుమారుడికి వ్యాయామం గురించి అవగాహన కల్పించడమే కాకుండా స్వయంగా చేయిస్తున్నా. తల్లిదండ్రులు ఈ దిశగా ఆలోచించి పిల్లలకు అలవాటు చేయాలి.

– సంజీవ్, శాంతినగర్, ఆదిలాబాద్

### ట్రాక్‌పై నడవడానికి ఆసక్తి



గత మూడు నెలల నుంచి ప్రతిరోజు ఉదయం 5 నుంచి 10 రౌండ్లు వాకింగ్ చేస్తున్నా. ఈ పంచతత్వ పార్కును పంచభూతాలను థీమ్‌గా తీసుకుని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పంచ భూతాలే జీవ కోటి మనుగడకు ఆధారం. అటువంటి పార్కుకు వాకర్లు ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఈ ట్రాక్‌పై నడవడానికి ఆసక్తి చూపుతున్నారు.

– సతీశ్, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్, ఆదిలాబాద్

## కోతుల దాడిలో పలువురికి గాయాలు



గాయం చూపుతున్న మైత్రేయగౌడ్

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలో కోతుల బెడద పెరిగిపోయింది. గుంపులుగుంపులుగా ఇళ్లలోకి ప్రవేశించి ప్రజలు, మహిళలు, పిల్లలపై దాడి చేస్తున్నాయి. తాజాగా శనివారం జిల్లా కేంద్రంలోని గుండి రహదారి సమీపంలోని ఆకుల యాదగిరిగౌడ్ కుమారుడు మైత్రేయ గౌడ్ ఇంటి ముందు నిలబడి ఉన్నారు. మూడు కోతులు వచ్చి దాడి చేశాయి. దీంతో వెన్ను భాగాన తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. పంచాయతీ అధికారులు కోతుల బెడద నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**పెంచికల్‌పేట్‌లో..**

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కొత్తగూడెంవాడలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి నీళ్లు పడుతున్న సమయంలో దావుల నర్సయ్యపై కోతుల గుంపు దాడి చేశాయి. ఇంటిపై నుంచి కిందికి దూకడంతో ఆయన కాలికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు నర్సయ్యను పెంచికల్‌పేట్ పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా, నర్సయ్యపై కోతుల దాడికి ముందే వాటి బెడద నివారించాలని మండల కేంద్రానికి చెందిన పలువురు సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్, కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.

### బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి సన్మానం



పల్లెం రాజలింగును సన్మానిస్తున్న డీసీపీ సుధీర్ రామ్

మంచిర్యాలటౌన్: గోవాలో గతనెల 24, 25, 26 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో 70 ప్లస్ విభాగంలో రాష్ట్రం తరఫున ఆడి బ్రాంజ్ మెడల్ సాధించిన పల్లెం రాజలింగును శనివారం డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మందమర్రికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పల్లెం రాజలింగు రాష్ట్రం తరఫున బ్యాడ్మింటన్ పోటీలకు వెళ్లి మెడల్ సాధించడం గర్వంగా ఉందన్నారు. సెప్టెంబర్‌లో కొరియాలో జరిగే మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు రాజలింగు అవకాశం వచ్చిందని తెలిపారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఏసీపీ ఎడ్ల మహేశ్, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వాసు, జాయింట్ సెక్రెటరీ రమేశ్‌రెడ్డి, మధు, కృష్ణ, హర్ష పాల్గొన్నారు.

## గుండెపోటుతో ప్రిన్సిపాల్ మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కార్ల వెంకటేశ్వర్లు(56) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం ఇంటర్మీడియెట్ చివరి పరీక్ష విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో మంచిర్యాల శివారు గద్దెరాగడిలోని ఇంటికి వెళ్లాడు. ఆయన భార్య బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు శ్రీలత ఇంటికి వచ్చి చూసేసరికి పడిపోయి ఉన్నాడు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం స్వస్థలం కాగజ్‌నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

### కలప తరలిస్తున్న కారు పట్టివేత

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని కవ్వాల్ నుంచి అక్రమంగా కలప తరలిస్తున్న కారును శనివారం పట్టుకున్నారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హాఫీజొద్దీన్ తెలిపిన వివరాలు.. పక్కా సమాచారంతో సిబ్బంది అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా కారులో రెండు కలప దుంగలు ఉన్నట్లు తెలిపారు. డ్రైవర్ పారిపోయాడు. కలపతో సహా కారును సీజ్ చేసి డివిజన్ కేంద్రానికి తరలించామన్నారు. దీని విలువ రూ.15 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## సేఫ్టీ మేనేజ్‌మెంట్ యాక్షన్ ప్లాన్ అమలుపై సమీక్ష



మాట్లాడుతున్న జాన్‌ఆనంద్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో సేఫ్టీ మేనేజ్‌మెంట్ యాక్షన్ ప్లాన్ అమలుపై ఉద్యోగులు, అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్‌తోపాటు డీజీఎం సేఫ్టీ జీఎస్ గోపాల్‌రాజ్, రామ్‌నాథన్ పాల్గొన్నారు. శాఖలవారీగా ఏరియా యాజమాన్యం అవలంబిస్తున్న రక్షణ చర్యల వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్పొరేట్ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా సేఫ్టీ జీఎం మాట్లాడుతూ ఉద్యోగులందరూ రక్షణ సూత్రాలు పాటించి ప్రమాదరహిత సంస్థగా సింగరేణిని తీర్చిదిద్దాలని సూచించారు. సమావేశంలో ఏరియా జీఎం దేవేందర్, ఎస్‌వోటూజీఎం గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్, మేనేజర్ ప్రవీణ్‌ఫటింగ్, పీఈ రాజాజీ, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, టీబీజీకేఎస్ నాయకులు వెంకటేశం, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, సంక్షేమాధికారి వేణు పాల్గొన్నారు.

### 'కేంద్రానివి ప్రజా వ్యతిరేక విధానాలు'

కాగజ్‌నగర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు పేర్కొన్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో శనివారం నిర్వహించిన వివిధ సంఘాల అసంఘటిత రంగ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలను రాష్ట్రంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామ స్థాయి నుంచే విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 5న నిర్వహించే చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గనుల్లో నాసిరకం మెటీరియల్

- హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: ఎస్సార్పీ–1 గనితోపాటు చాలా గనుల్లో కంపెనీ మెటీరియల్ నాసిరకంగా ఉంటున్నాయని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన ఎస్సార్పీ 1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కోల్ కట్టర్లు ఉల్లుకోసే రాడ్లు పూర్తిగా నాసిరకంగా ఉంటున్నాయని అన్నారు. డ్రిల్ రాడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. చివరికి కార్మికులకు ఇచ్చే బూట్లు నాణ్యత లోపించిందన్నారు. యాక్టింగ్ చేస్తున్న మేషన్, సాండ్ మిక్సింగ్ కోన్ ఆపరేటర్, టబ్బు రిపేర్ మజ్దూర్ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇన్ని సమస్యలు ఉన్నా కూడా టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నేతలు అధికారులను ప్రశ్నించకుండా వారికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జీవన్‌జోయల్, బ్రాంచి కార్యదర్శి తిప్పారపు సారయ్య, నాయకులు రాయలింగు, దుర్గం లక్ష్మణ్, వెంకటస్వామి, నామాల శ్రీనివాస్, మీస కొమురయ్య పాల్గొన్నారు.

## రూ.కోటి బీమా కోసం కృషి

- సింగరేణి డైరెక్టర్(ఫైనాన్స్, పా) ఎన్.బలరాం
- రెస్క్యూ మృతులకు బీమా చెక్కులు పంపిణీ



రాము కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న డైరెక్టర్ బలరాం

శ్రీరాంపూర్: ఉద్యోగులు ప్రమాదవశాత్తు మృతిచెందితే వారి కుటుంబానికి రూ.కోటి బీమా డబ్బులు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని సింగరేణి డైరెక్టర్(పా, ఫైనాన్స్) ఎన్.బలరాం అన్నారు. గత వర్షాకాలంలో దహెగాం వరదల్లో బాలింతను కాపాడడానికి వెళ్లి మృతిచెందిన రెస్క్యూ సభ్యులు అంబాల రాము, చిలుక సతీశ్ కుటుంబ సభ్యులకు శనివారం ఆర్కే 5గనిపై బీమా డబ్బులు అందజేశారు. రాము భార్య స్పందనకు రూ.78 లక్షలు, సతీశ్ భార్య మమత రూ.32 లక్షల చెక్కును అందించారు. ఇదే గనికి చెంది, ఇతర కారణాలతో మృతిచెందిన కార్మికుడు అచ్చె మొగిలి కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు కంపెనీ అండగా ఉండడం కోసం బ్యాంకర్లతో సంప్రదించి ఉద్యోగులందరికీ కార్పొరేట్ సాలరీ అకౌంట్లను తెరిచి వారికి రూ.లక్షల్లో బీమా ఇప్పిస్తున్నట్లు తెలిపారు.

**ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం**

నస్పూర్ కాలనీ, కృష్ణాకాలనీ వాసుల కోసం కృష్ణాకాలనీలోని సివిల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను డైరెక్టర్ బలరాం ప్రారంభించారు. ఆర్కే 5 గనిపై వనంలో మొక్కలు నాటారు. జీఎం కార్యాలయంలోని ఫైనాన్స్ అకౌంట్స్ సెక్షన్‌లో లక్ష్మీపూజలో పాల్గొన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి, ఎస్‌ఓటు జీఎం త్యాగరాజు, యూనియన్ బ్యాంక్ రీజియన్ అధికారి అరుణ్‌కుమార్, టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏజీఎం మురళీధర్, డీజీఎంలు అరవిందరావు(పర్సనల్), శివరావు(సివిల్), చంద్రశేఖర్‌రెడ్డి(వర్క్‌షాప్),చిరంజీవి(ఐఈడీ)పాల్గొన్నారు.

## వార్షిక ఉత్పత్తి సాధనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): గత ఆర్థిక సంవత్సరంలో ఏరియా కార్మికులు సాధించిన ఉత్పత్తిని స్ఫూర్తిగా తీసుకుని 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో బెల్లంపల్లి ఏరియాకు 36లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 29.2 లక్షల టన్నులతో 81 శాతం ఉత్పత్తి నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గోలేటి, ఎంవీకే ఓసీపీల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఎస్‌వోటు జీఎం కేహెచ్‌ఎస్ గుప్తా, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, డీవైపీఎం తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య



కళావతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

భీమిని: మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన మురికి కళావతి(19) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలం రేచిని గ్రామానికి చెందిన మురికి మల్లేష్‌తో గత సంవత్సరం కళావతికి వివాహం జరిగింది. నెల రోజులుగా తల్లిగారి ఇంటికి వచ్చి ఉంటోంది. కాపురానికి వెళ్లనని తల్లిదండ్రులకు చెబుతూ ఉండేది. మనస్తాపం చెంది శనివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఈరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమిని ఎస్సై వెంకటేష్ తెలిపారు.

**చికిత్స పొందుతూ వ్యక్తి..**



శ్రవణ్ మృతదేహం

భీమిని: మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామానికి చెందిన సిడాం శ్రవణ్(40) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. గత నెల 26న బంధువుల వివాహానికి వెళ్లి అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. గుర్తు తెలియని క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. కుటుంబీకులు బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. మృతుడి భార్య శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

**వివాహిత..**



స్వప్న (ఫైల్)

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన వివాహిత స్వప్న (28) చికిత్స పొందుతూ చనిపోయింది. ఎ స్సై లక్ష్మణ్ వివరాల ప్రకా రం.. గత నెల 30న గ్రామానికి చెందిన మరో మహిళతో గొడవ జరిగింది. ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగి దూషించుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన స్వప్న శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగింది. కుటుంబీకులు మంచిర్యాలకు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శనివారం చనిపోయింది. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. భర్త రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## సమస్యలపై డైరెక్టర్‌కు వినతిపత్రం

మందమర్రిరూరల్: సింగరేణిలో సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ నాయకులు సింగరేణి డైరెక్టర్(పా) బలరాంనాయక్‌కు వినతిపత్రం అందించారు. శనివారం మందమర్రికి వచ్చిన డైరెక్టర్ ఏరియాలోని కేకే–5 గని సమీపంలోని మంకీ ఫుడ్ కోర్టును సందర్శించి మొక్కల ఎదుగుదలపై గని అధికారులను అడిగి తెలుసుకున్నారు. టీబీజీకేఎస్ నాయకులు డైరెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై చర్చించి వినతిపత్రం అందించారు. ఆర్కే ఓసీని మందమర్రి భవిష్యత్ కోసం విస్తరించాలని, ఉద్యోగులకు నాణ్యమైన పనిముట్లు, బూట్లు అందించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఏరియా బ్రాంచ్ సెక్రెటరీ సత్యనారాయణ ఏరియాలో హెచ్‌ఆర్‌ఏ చెల్లించడం లేదని తదితర సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు

## ఎస్‌అండ్‌పీసీ సిబ్బందిని నియమించాలి



జీఎంకు వినతిపత్రం అందిస్తున్న హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు రాజాబాబు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో ఎస్‌అండ్‌పీసీ సిబ్బందిని నియమించాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం దేవేందర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా సెక్యూరిటీగార్డుల నియామకం లేకపోవడంతో సిబ్బంది కొరత సమస్యతో దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. పనిచేస్తున్న సిబ్బంది పైనే తీవ్ర పనిభారం పడుతోందని దాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌అండ్‌పీసీ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న జనరల్ మజ్దూర్లను వెంటనే ఎస్‌అండ్‌పీసీలు పదోన్నతులు కల్పించాలన్నారు. ఉత్పత్తికి విఘాతం కలగకుండా గోలేటి సీహెచ్‌పీలో లారీల ఇన్ ఔట్‌లు వేసేందుకు ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నియమించాలన్నారు. ఫిట్ కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, ఎండీ వసీం, శ్రీనివాస్, రమేశ్, గోపాలకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీఓఈలో నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్



మాట్లాడుతున్న ఎన్‌వైకే అధికారి సుశీల్‌బాద్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాలలో శనివారం జిల్లా స్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం, యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థి, యువజనులకు అవగాహన కల్పించారు. నెహ్రూ యవకేంద్ర, జిల్లా యువజన అధికారి సుశీల్‌బాద్ మాట్లాడుతూ 2022–23 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా స్థాయిలో నైబర్ హుడ్ పార్లమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జీ 20 శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతుందని వివరించారు. విద్యార్థి, యువజనులకు అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా యూత్ పార్లమెంట్ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అనంతరం యూత్‌పార్లమెంట్ నిర్వహించారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌పై చర్చలో విద్యార్థి, యువజనులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గజ్జెల్లి మోహన్, సీఓఈ అధ్యాపకులు పాల్గొన్నారు.